# పక్షవా(పా)తం

## ఆల్ ఇండియా రేడియో

"మనకు మనం కొనితెచ్చుకొనే రోగం
పక్షవాతంలాటి పక్షపాతం."

"అమ్మాయ్ బృందా! కాస్త మంచినీళ్ళు తెచ్చియ్యవే గొంతు ఆరుకుపోతోంది" పక్షవాతంతో మంచానికి పరిమితమైపోయిన శితారత్నమ్మ మనుమరాల్ని కేకేసింది.

టెన్త్‌క్లాస్ పరీక్షలకు సీరియస్‌గా చదువుతున్న బృంద విసుక్కుంది. "నీకెప్పుడూ సేవలు చేయడంతోనే సరిపోతోంది. నేను చదువుకునేదెప్పుడింక?"

"ఏమిటా మాటలు చిన్నంతరం పెద్దంతరం లేకుండా నానమ్మ అడుగుతుంటే.... లేచి ఒక్కగ్లాసు నీళ్ళిచ్చి తర్వాత చదువుకోలేవూ?" ఆ ప్రక్కనే కూతురికి మిషన్ మీద జాకెట్టు కుడుతున్న వింధ్యావళి కూతుర్ని కసిరింది.

"ఏం? ప్రక్కనే పనీపాటా లేకుండా వీడియోగేమ్ ఆడుకుంటున్నాడు అన్నయ్య... ఆయన్ని అడక్కూడదూ?" ఈ సారి ముసలమ్మకు కోపం వచ్చింది.

"ఏమిటే ఆడదానివి.... అంత నీలుగుడు, రేపొద్దున్న మొగుడికి చేసిపెట్టవూ? ఆ చదువులు చదివి మమ్మల్ని ఉద్ధరించాలా నువ్వు?... పైగా వాడు మగాడు వాడిని మంచినీళ్ళుమ్మంటావా?"

మిషన్ తొక్కుతున్న వింధ్యావళి కాళ్ళల్లో చలనం ఆగింది. చేతిలోని సగం కుట్టిన జాకెట్టు అక్కడేవేసి లేచి నిల్చుంది. "మంచినీళ్ళు నేనిస్తాకానీ వాళ్ళిద్దరి మధ్య భేదాలు చూపించకండత్తయ్యా" కాళ్ళు చేతులు సరిగా పనిచేయకపోయినా శితారత్నమ్మ గారి మెదడు, నోరు బాగానే పనిచేస్తున్నాయి.

"ఆడా, మగా తేడాలేదని నువ్వూ, నేను అనుకుంటే సరిపోతుందా? ఆడ ఆడే, మగ మగే."

అత్తగారి మాటలు పట్టించుకోకుండా మంచినీళ్ళు తేవడానికి లోపలికెళ్ళింది వింధ్యావళి. 'విన్నావా!' అన్నట్టు కళ్ళెగరేసి చొక్కా కాలరు ఒకసారి ఎత్తి వదిలాడు పదోక్లాస్ ఈ సంవత్సరం రెండోసారి తప్పిన అభిలాష్. కోడలి చేతిలోని మంచినీళ్ళగ్లాసు అందుకుంటూ అంది శీతారత్నమ్మ "వింధ్యా! నిన్ను చాలా శ్రమ పెడుతున్నానే."

"పర్వాలేదత్తయ్యా ఇదొక శ్రమా!" చిన్నగా నవ్విందామె.

"మరయితే నా కొడుకు యీ సేవలన్నీ నాకెందుకు చెయ్యడమ్మా?"

"ఆయనకెక్కడ తీరిక? నేనున్నానుకదా?"

"ఉన్నావనుకో, ఉహుఁ అదికాదూ! వాడింట్లో వున్నప్పుడు కూడా నువ్వు వంటింట్లో వుంటే.... మందూ మాకూ నాకివ్వాల్సి వస్తే.... నిన్నే కేకేస్తాడేమిటి?..." ముసలామె కోడలి జవాబుకోసం ఆతృతగా ఎదురుచూస్తూ అంది.

"ఆయన మగాడు" నాలుక చివరిదాకా వచ్చిన మాటని మింగేసింది వింధ్యావళి. నిజం చెప్పాల్సివస్తే అదే జవాబు. కానీ... ఆ జవాబు ఆమె ఇవ్వదల్చుకోలేదు. ఆ చేదు నిజాన్ని కక్కి, తరతరాలుగా జీర్ణించుకున్న ఈ హీనమైన భేద భావానికి మరింత నీరుపోసి, ఏపుగా పెంచదల్చుకోలేదు.

"ఆయన ఆఫీసు పనితో విసిగిపోయి ఇంటికొస్తాడు కదా! పాపం ఈ సాయంత్రం పూటన్నా కాస్త విశ్రాంతి కావాలి కదా!"

"మరి నీకూ?" ఆమె నవ్విన నవ్వుకు కట్టుడు పళ్ళు కొద్దిగా లూజ్ అయ్యాయి. 'నిజమే! ఇంట్లో తనేం తక్కువ పనిచేయడం లేదు. వంటపని, ఇంటిపని, పిల్లల చదువుపనే కాక, చన్నీళ్ళకు వేణ్ణీళ్ళు తోడని మిషన్ కుట్టి నాలుగు రాళ్ళు కూడా సంపాయించే ధ్యాసలో కాళ్ళునొప్పులు కూడా కొని తెచ్చుకుంది. తీరా నడుం వాలుద్దామనుకునే టైమ్‌లో అత్తయ్యకు ఏదో అవసరాలు.... పాపం లేచి చేసుకోలేని మనిషి. చెయ్యందించడం ధర్మంకదా!... కాలూ చెయ్యి బాగున్నప్పుడు ఆమె తనకు చేదోడు వాదోడుగానే వుండేది కదా! పైగా ఆమెకు ఏదైనా తక్కువ చేస్తే ఈయన మండిపడడూ!...'

ఆమె ఆలోచనలు అక్కడ ఆగిపోయాయి. అత్తయ్య చెప్పినట్టు... ఆయన చేసే పనికంటే శారీరకంగా, మానసికంగా కూడా తనేం తక్కువ చేయడంలేదు. అలాంటప్పుడు అత్తగారి పని తను చేయకపోతే ఆయనెందుకు మండిపడాలి? ఆయనే చెయ్యొచ్చు కదా! అలా అని తను అడగగలదా? అడిగితే ఏమౌతుంది? చెయ్యి చేసుకోక

పోయినా పరిణామాలు అంత బాగుండవు. అందుకే తను నోరు తెరువదు. వింధ్యావళి నోరు తెరవకపోయినా, ముసలమ్మ పళ్ళు సర్దుకుని నోరు తెరవనే తెరిచింది.

"ఏమే వింధ్యా! జవాబు చెప్పవూ?"

"ఆయనకు బద్ధకంలెండత్తయ్యా! నా కాలు, చెయ్యి ఆడినంతవరకు మీకేం తక్కువ చేయను నేను."

"నువ్వేం తక్కువ చేయవని నాకు తెలుసమ్మా, కానీ నేను కోరే జవాబు అది కాదు. ఆ జవాబు నీకు తెలుసు. వాడు మగాడు. ఆ నిజమే నిన్నలా కేకేసేలా చేస్తోంది."

"అత్తయ్యా! గట్టిగా అనకండి. పిల్లలు వింటారు" కంగారుగా అంది వింధ్య.

ఆడడం ఆపి నానమ్మ మాటలు శ్రద్ధగా వింటున్న అభిలాష్ కంగారుగా తలదించి మరలా వీడియోగేమ్ ఆడడంలో మునిగిపోయాడు. "పిచ్చిదానా! వింటే ఏమవుతుందే వాళ్ళ రక్తంలోనే వుంది. సరే ఇంక అనునులే పో, చూడు తల ఎంత చిందరవందరగా వుందో! మగాడు వాడు సంపాయిస్తున్నాడు. నువ్వు ఎందుకు తాపత్రయం పడడం... ఆ మిషన్ దిగివెళ్ళి స్నానంచేసి తలదువ్వుకో పో... పో... పో...."

నిట్టూర్చింది వింధ్యావళి. తన అత్తకూ తెలుసు ఈ ఆడ, మగ తారతమ్యం వల్ల తామెంత అశాంతి పాలవుతున్నారో! కానీ ఆమె రాజీ పడుతోంది. తన తరం ఇలాగ దాటిపోతుందనే నమ్మకంతో రాజీ పడుతోంది. ఆ భేదాన్ని ఛేదించాలని ఆమె ప్రయత్నించలేదు. ఆ సంగతి తనకు తెలుసు.

తనూ రాజీపడుతోంది. ఇంతకంటే గత్యంతరం లేదని రాజీపడుతుంది. కాని తన బిడ్డల తరంలోనయినా ఈ భేదభావం పోతే ఎంత బాగుంటుంది!... నిట్టూర్చి బట్టలు తీసుకుని స్నానం చేయడానికి బాత్‌రూమ్‌లోకెళ్ళి టేప్ తిప్పబోతున్న వింధ్య కొడుకు గొంతు విని ఆగిపోయింది. "విన్నావా? నానమ్మ ఏమందో మగాడు మగాడే, ఆడది అడదే. ఆ పుస్తకాలు మూసి వెళ్ళి అంట్లు తోము పో. ఏవిటీ?... చదివి నాతో సమంగా డిగ్రీ తెచ్చుకోవాలనే..."

"ఆ నీతో సమంగా ఏమిటి నీకంటే పెద్ద చదువులు చదువుతాను. పెద్ద ఉద్యోగం చేస్తాను."

"ఆహాఁ ఉద్యోగాలు చేస్తావా? చెయ్ చెయ్ ఉద్యోగం చేసినా, వంటపని చేసు కోవాల్సిందేలే?"

"ఏం చేసుకోనా?" వుడుక్కుంది బృంద.

"చేసుకోకపోతే ఎవడు చేస్తాడేం... నీ మొగుడు చేస్తాడా?"

"ఆ చేస్తాడు ఎందుకు చేయడూ....? ఎంచక్కా చేస్తాడు. ఇద్దరం ఉద్యోగం చేసుకుంటాం, వంటా చేసుకుంటాం."

"ఆహాఁ నేను చూడనా? ఎంతమాత్రం మీ ఆయనచేత వంట చేయిస్తావో." ఆ తరువాత వింధ్యకు వారి మాటలు విన్పించలేదు. సన్నగా విన్పించిన వెక్కిళ్ళ శబ్దానికి తృళ్ళిపడి స్నానం చేయకుండానే హడావుడిగా బయటకొచ్చింది. ఆమె బయటకొచ్చేసరికి అభీ చెల్లెలి కన్నీళ్ళు తుడుస్తున్నాడు. "ఏడవకు, తమాషాకి... నిన్ను ఉడికించడానికి... కావాలని అన్నాను ప్లీజ్ ఏడవకు" కోపంగా బాత్‌రూమ్‌నుండి బయట కొచ్చిన వింధ్య కరిగిపోయింది.

తన కొడుకు అభిలాష్‌కు అలాంటి అభిప్రాయం రావడానికి కారణం వాడి స్నేహితుడు, పెద్దమ్మ కొడుకు అయిన స్నేహ. వాడినీ తప్పు పట్టలేం. వాడు పెరుగు తున్న వాతావరణం అలాంటిది. పెద్ద తోడికోడలి కూతురికి ఈమధ్యనే పెళ్ళయింది. కట్నం బాగానేపెట్టి చీరాసారే బాగానే జరిపారు. అయినా కలతలే. వాళ్ళు పిల్లని పుట్టింటికి పంపడంలేదు. కారణం తెలియక తల బద్దలు కొట్టుకుంటుంటే... ఈ మధ్య దయ తలచి కారణం వివరించారు.

పెళ్ళిలో మగపెళ్ళివాళ్ళకు కట్నం, కానుకలు బాగా జరిగాయి కానీ జరగాల్సిన మర్యాదలు జరగలేదట. తమకు, వాళ్ళకు మధ్య కలతలుండొచ్చు కానీ, దేనికవే అనుకోవాలి... విశాలక్క, మర్యాద ఇవ్వడంలో ఎవ్వరికీ ఏ లోపం చేయదు. ఇంకా చెప్పాలంటే ఇంటికి వచ్చిన వాళ్ళకి మాట మర్యాద కానీ, తిండి మర్యాద కానీ కాస్త అతిగానే వుంటాయి. ఆ మాటే తను తన భర్తతో అంటే, 'మగపెళ్ళివాళ్ళు కదా! వాళ్ళకెలా వుంటే బావుంటుందో గ్రహించుకుని ఆడపెళ్ళివాళ్ళు సలాములు కొట్టాల'నే భయంకర మైన సత్యాన్ని ఎదుగుతున్న తన కొడుకు ముందే బయటపెట్టారు. ఆడపిల్లకు భర్త ఎంత అవసరమో మగపిల్లాడికి భార్య అంతే అవసరమనే చిన్న సత్యం వీళ్ళకెందుకు తెలియకపోతోంది? మగపెళ్ళివాళ్ళ గొప్పను జీర్ణించుకున్న తన భర్త రేపు ప్రొద్దున డాక్టరయ్యే తన కూతురు బృందకు కాబోయే వియ్యంకులకు కట్నం ఇచ్చి కాళ్ళు కడిగి కన్యాదానం చేసి, తను జీవితాంతం వియ్యంకుల కాళ్ళు పట్టుకుంటూనే వుంటారు కాబోలు.

ఎంత సిగ్గుచేటు! ఏదైనా వస్తువుకొంటే డబ్బిచ్చి కొంటాం. ఏదైనా వస్తువు అమ్మితే డబ్బు పుచ్చుకుంటాం. అది వ్యాపారం. కానీ ఇక్కడ ఏం జరుగుతోంది? డబ్బిచ్చి అల్లుణ్ణి కొంటున్నామా? కాదు డబ్బిచ్చి మరీ అమ్మాయిని 'ఈడ బిడ్డ' కాదు 'అడబిడ్డ' అని వాళ్ళ స్వంతంచేసి... ఇదే ఆచారమని తృప్తిపడి చేతులు దులుపుకుంటు న్నాం. ఎంత అన్యాయం!

ఆఖరుకు డబ్బిచ్చి కొనుక్కున్న కుక్కపిల్లకు వాక్సినేషన్‌కి, మందులకి, మాంసాలకి ఖర్చు పెడుతున్నాం. కాన్పులు చేసుకుంటున్నాం. అలాంటిది నీ ఇంటికి శాశ్వతంగా వచ్చే ఆడపిల్ల డబ్బు మూటతో రావాలా? పైగా ఆ కాన్పులకయ్యే ఖర్చు డబ్బిచ్చి మరీ పిల్లని అమ్ముకున్న తల్లిదండ్రులే భరించాలా? ఇదెక్కడి న్యాయం?

"చూడు అభీ! నువ్వు మీ చెల్లెలితో ఏదో అంటున్నావు చూడూ అది తప్పమ్మా."

"ఊరికే అన్నానులేమ్మా, సరదాకి" తల వంచుకున్నాడు అభి. సరదాకని ఈనాడు అంటున్న తన కొడుకుని ఇలాగే పెరగనిస్తే మరో శ్రీకాంత్ అవుతాడు. తన తోడికోడలి అల్లుడిలా......

"చూడూ! మనం నమ్మే దేవుడే నిజమైతే... మన భారతీయ విలువలే నిజమైతే స్త్రీ పూజింపబడే దేశం నాన్నా ఇదీ... ఎక్కడ స్త్రీ పూజింపబడుతుందో అక్కడ దేవతలు ఆశీర్వదిస్తారు అంటుంది మన హిందూమతం... వింటున్నావా?"

"సారీ మమ్మీ" తలతిప్పి చూసింది వింధ్యావళి. వాడు 'సారీ' చెపుతున్నాడు. తన కోపాన్ని తగ్గించటానికి సారీ చెపుతున్నాడు. అంతేగాని వాడి తప్పు వాడికి తెలీలేదన్న నిజం, అపరాధ భావంలేని వాడి కళ్ళే చెపుతున్నాయి.

"అభీ, సారీ చెపుతున్నావెందుకురా?" అడిగింది వింధ్యావళి. వాడు జవాబు చెప్పలేదు. "రా! ఇలారా! కూర్చో...." కొడుకు చెయ్యిపట్టుకుని కూర్చోబెడ్తూ తనూ కూర్చుంది వింధ్యావళి.

"చూడు నాన్నా అభీ! చెల్లెలు, నువ్వు మాకు ఒకటే కదరా" కాస్త సంకోచిస్తూ అన్నది.

అభిలాష్ గోడకానుకుంటూ... "మరైతే అమ్మా! చెల్లి పెళ్ళి చేసుకుని వెళ్ళి పోతుంది కదా! నేనేకదా మీ దగ్గరుండేది" అన్నాడు. క్షణం మాట్లాడలేదు వింధ్య. తర్వాత అంది.

"ఎక్కడికి వెళ్తోందిరా. మరో ఇంటికి కోడలిగా వెళ్తుంది. మరో అమ్మాయి మనింటికి వస్తుంది కదా! రేపు ఉద్యోగం వస్తే వేరే వూరికి నువ్వు వెళ్ళిపోవా? అంత మాత్రాన నువ్వు మాకు కొడుకువి కావా? అంతే ఇదీనూ...." ఈసారి అభిలాష్ ఆలోచించి అన్నాడు.

"మరయితే చెల్లికి కట్నం ఇవ్వాలి. నాకయితే కట్నం వస్తుంది" ఆశ్చర్యపోలేదు వింధ్య. తన కొడుకు నోటివెంట ఆ మాటను ఈ క్షణంలో వింది అంతేగానీ, వాడేం చిన్నవాడు కాదు. వాడి మనసులో వుండే భావమే ఇది. ఈ జవాబు ఆమె ఎదురు

చూసిందే. వింధ్యావళి ఈ వాగ్యుద్ధానికి సిద్ధపడే మొదలెట్టింది. అత్తగారు గురకపెట్టి నిద్రపోతున్నారు ప్రక్కనే... అంతవరకు సంతోషం....

"నువ్వు కట్నం తీసుకుంటావా అభీ? తప్పుకదూ!" వాడు తలవంచుకున్నాడు. ఆ తల వంచుకున్నది కట్నం తీసుకుంటానని చెప్పడం తప్పనికాదు, తన తల్లికి కోపం వచ్చిందని.

"కట్నం తీసుకోవడమంటే ఏమిటో తెలుసా? నువ్వు అమ్ముడు పోవడం. అలా అమ్ముడుపోవడం నీకిష్టమా?" వాడు తలెత్తాడు.

"భలేదానివే మమ్మీ! ఇది అమ్ముడుపోవడం ఎలా అవుతుంది?.... అదే నిజ మయితే శ్రీకాంత్ బావ, పెద్దమ్మవాళ్ళింటికి వచ్చేయాలి కదా! శ్రీకాంత్ బావ రెండు లక్షలు కట్నం తీసుకుని దర్జాగా వున్నాడు. బావను చూస్తే అక్కకి, పెద్దమ్మకి చాలా భయం నీకు తెలుసా?" వింధ్య తన కోపాన్ని అణచుకుంది. నిజమే! వాడు పెరుగుతున్న కల్మష వాతావరణం ఇది.

"మమ్మీ! పెద్దమ్మ ప్రొద్దున ఏడుస్తూ వుంది. సరితక్కను పంపమంటే వాళ్ళత్త పంపలేదట." వాడన్న మాటల్లో పెద్దమ్మమీద జాలితోపాటు పెళ్ళయ్యాక ఆడది భర్త సొత్తు అనే శాసనాన్ని నమ్మిన భావం వుంది.

నిజమే! పంపించలేదట హఠాత్తుగా ఇరవై ఏళ్ళు పెంచిన కూతురికి తాము ఇక ఏమీ కాదన్న అవాంఛనీయ భావాన్ని తల్లి జీర్ణించుకోలేకపోతోంది.

"ఇప్పుడు కన్నవారింటికి పంపని వీళ్ళు రేప్రొద్దున కాన్పుకి పంపిస్తారు. ఆడపిల్ల మీద ఆ పిల్ల తీసుకెళ్ళిన డబ్బుమూటమీద ఆ పిల్ల ఇచ్చే బిడ్డలమీద సర్వాధికారాలు మగబిడ్డని కనేవాళ్ళవి.... ఏమి తీర్పు ఇది?" అదే అంది వింధ్య తన కొడుకుతో.

"బావ ఉద్యోగం చేస్తున్నాడు కదా మమ్మీ, సరితక్క చేయడం లేదుకదా! పైగా వాళ్ళు మన సరితక్కకు అన్నం పెడుతున్నారు కదా మమ్మీ." వాడి మాటలు అమాయకంగా వున్నా వాడిలో ఇలాంటి భావాలు ఎంత లోతుగా వున్నాయో వింధ్యకు అర్థమయింది.

తనలో కలిగిన విరక్తిని నొక్కిపెడ్తూ మరలా సౌమ్యంగానే అంది వింధ్య.

"నీకు, బృందకు..... మీరేదో మాకిస్తేనే మీ నాన్న అన్నం పెడుతున్నారా? చదివిస్తున్నారా?" ఈ ప్రశ్నకు జవాబు వాడికి వెంటనే తట్టలేదు.

"ఏమిటి వింధ్యా! వాడిని వూదరగొట్టేస్తున్నావు. అది మన సంప్రదాయం అని వూర్కోవాలి. తల బద్దలు కొట్టుకున్నాక ఏమొస్తుంది? పైగా నా నిద్ర పాడుచేశావు కదే!"

మునలమ్మ నిద్రలేచింది. "ఇది మన భారతీయ సంస్కృతి కాదత్తయ్యా! ఆచారాల పేరిట మనకై మనం విధించుకున్న మరణశిక్ష ఇది."

"ఏమిటో నువ్వూ నీ చాదస్తం" ఆవిళించిందామె. తను తన బిడ్డల్ని ఎలాంటి భేద భావంతో పెంచకూడదన్న ఆశయానికి అడుగడుగునా ఆటంకపరుస్తున్న చాలా మందిలో ఒకటైన తన అత్తగారిని ఏమీ అనలేక కొడుకుతో తన బెడ్‌రూమ్‌లో కొచ్చింది వింధ్య.

"అభీ! నిజంగానే మగవాడు గొప్ప, ఆడది తక్కువ అని అంటున్నావా?"

"లేదు మమ్మీ. ఊరికే సరదాకి" సరదాకని ఈనాడు అంటున్న తన కొడుకుని ఇలాగే పెరగనివ్వకూడదు.

"చూడు నాన్నా! శ్రీకాంత్‌ని చూసి నువ్వు చాలా నేర్చుకోవాల్సింది వుంది ... పెళ్ళికొడుకు తరపువాళ్ళు ఆధిక్యతా భావంవల్ల మీ పెద్దమ్మ, మీ అక్క ఎంత బాధపడు తున్నారో గ్రహించి ఆ బాధని నువ్వు తర్వాత నీ భార్యకు, మీ అత్తగారికి ఇవ్వకూడదు. అర్థమయ్యిందా? నువ్వు మరో శ్రీకాంత్‌వి కాకూడదు ఏం?"

"అలాగే మమ్మీ!" నిజాయితీగా అంటున్న ఆ పసివాడి కళ్ళలోకి చూసింది వింధ్య. అవి నిజాయితీగానే చూస్తున్నాయి. అరగంట క్రితం వాటిలోనున్న మగ అహంకారం ఇప్పుడు లేదు. ఇది తాత్కాలికం కావచ్చు. చెల్లి కన్నీళ్ళనుండి, తల్లి చెప్పిన తొలిపాఠం నుండి నేర్చుకున్న వివేకంవల్ల వచ్చిన మార్పు కావచ్చు.

కానీ ప్రతి తల్లి కొడుక్కి ఇలా పాఠాలు చెప్పిన రోజు, అలా పాఠాలు చెపుతున్న తల్లిని చుట్టుప్రక్కలవాళ్ళు నిరాశపరచని రోజు మగవాళ్ళమన్న అహంకారం ఇచ్చే అశాంతి ఆడవాళ్ళకు లేకుండా పోతుంది. కానీ ఆ రోజెప్పుడో?

మగబిడ్డను కన్నతల్లే దీనికి జవాబు చెప్పాలి?

కథా నిలయం
5346
శ్రీకాకుళం